కవర్ స్టోరీ



ఒకచో నేలను బవ్వళించు, నొకచో నొప్పారు బూసెజ్జపై
నొకచో శాకము లారగించు, నొకచో నుత్కృష్ట శాల్యోదనం
బొకచో బొంత ధరించు, నొక్కొక్కతరిన్ యోగ్యాంబర శ్రేణి, లె
క్కకు రానీయడు కార్యసాధకుడు దుఃఖంబున్ సుఖంబున్ మదిన్

భర్తృహరి కార్యసాధకుడికి ఓ రూపమిచ్చి ప్రాణంపోస్తే..
ఆత్మాభిమానమిచ్చి పోరాట స్ఫూర్తి నింపితే ఆ విరాట్ రూపం..
బక్కపలచ కేసీఆర్. ఒంటరిగా అడుగేసిన రోజుల్లోనూ అదే
నినాదం. లక్షల జనం నీరాజనం పట్టిన
సమయంలోనూ అదే నినాదం..
జై తెలంగాణ!

# దటీజ్.. కేసీఆర్!

ఆంధ్ర పాలకుల కుయుక్తులను ఎంత సమర్థంగా ఎదుర్కొన్నారో, ఢిల్లీ నేతల కుటిల వ్యూహాలను కూడా అంతే నేర్పుగా తిప్పికొట్టారు. స్వప్నించారు. పోరాడారు. తెలంగాణ సాధించారు. నెర్రలుబారి, నోరు తెరుచుకున్న పడావు భూముల గొంతులో.. జల ప్రవాహాల పాయసం పోశారు. అప్పులపాలై తిప్పలు పడుతున్న సేద్యగాడికి ఆత్మబంధువై రైతుబంధు ప్రకటించారు. నెత్తిన బిందెతో, చంకన బిడ్డతో.. మైళ్లకు మైళ్లు నడిచి నడుమునొప్పులు తెచ్చుకుంటున్న చెల్లెమ్మల పాలిట అపర భగీరథుడు. పేదింటి ఆడపిల్ల పెండ్లికి పైసలు సర్దుబాటు చేసే సమయానికి.. పేగు తెంచుకోకుండా పుట్టిన పెద్ద కొడుకు. బిక్కుబిక్కుమంటూ ఓ దిక్కున కూర్చున్న వయోధికులకు ఠంచనుగా పింఛను అందించే వేళ .. ఐదో దిక్కు. రైతుల గుండెల్లో ఇరవైనాలుగు గంటలూ వెలిగే విద్యుత్ బల్బు . ప్రతిపక్షాల పాలిట ముట్టుకుంటే మాడ్చేసే కరెంటు తీగ!

★ ★ ★

కేసీఆర్ వ్యక్తిత్వం.. బహుముఖీనం. జీవితం.. తెరిచిన పుస్తకం. నాయకత్వం.. ఉద్యమ పాఠం. పాలన.. కాకతీయుల స్వర్ణయుగం. దార్శనికత.. దిగంతాలకు పాకిన అభివృద్ధి కథ. సంక్షేమ పథకాలు.. సకల జనులకు వరాలు.

**దటీజ్.. కేసీఆర్!**